ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 2 మే 2025

విద్యార్థులను అభినందించిన కలెక్టర్



ఉత్తమ ఫలితాలు సాధించిన ఇంటర్ విద్యార్థులతో కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం తన ఛాంబర్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. మంథనిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో 100 ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఎం అజయ్ కుమార్ 573 మార్కులు, ఆర్ అభినవ్ 566 మార్కులు, ఆర్ కౌశిక్ భార్గవ్ 563 మార్కులు, పి చందు 561 మార్కులు, డి శివచరణ్ తేజ 558 అత్యధిక మార్కులు సాధించారు. అలాగే ఇంటర్మీడియట్ ఫలితాల్లో మంథని బాలుర సాంఘిక సంక్షేమ విద్యాలయం విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో జె శ్రీనివాస్ ఎంపీసీలో 983 మార్కులు, జె సంతోష్ 963 అత్యుత్తమ మార్కులు సాధించారు. మంథని బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 93 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ ఫలితాలు వచ్చేందుకు కృషి చేసిన అధ్యాపక, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్మా జబీన్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష

● న్యూస్ బాక్స్


గంగారం భూములు పరిశీలించిన ఆర్డీవో

కాల్వశ్రీరాంపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామశివారులో ఆర్డీవో గంగయ్య గురువారం రైతుల వ్యవసాయ భూములను పరిశీలించారు. గతంలో ఇరిగేషన్ అధికారులు గంగారం గ్రామంలోని హుస్సేన్‌మియా వాగులో చెక్‌డ్యాం నిర్మించి కుడి, ఎడమ కాలువలను పొలాల నుంచి ఏర్పాటు చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం భూములు పోయిన రైతులకు ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంతో ఆ గ్రామానికి చెందిన సుమారు 105 మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆర్డీవో గంగారం గ్రామంలో చెక్ డ్యాం కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించామని రైతులు అంబాల రాజేందర్, వ్యవసాయ భూములు పోయిన రైతులు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఇరిగేషన్ ఏడీఈ రవి ఉన్నారు.

సీతంపేట, ఖమ్మంపల్లిలో డీఎల్‌పీవో ఆకస్మిక పర్యటన

ముత్తారం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట, ఖమ్మంపల్లి గ్రామాలను గురువారం డీఎల్‌పీవో సతీష్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని ప్రజలకు సూచించారు. సెగ్రిగేషన్ షెడ్‌లో కంపోస్టు ఎరువు తయారు చేయాలని పంచాయతీ సెక్రెటరీ, సిబ్బందికి సూచించారు. అనంతరం వైకుంఠధామం, నర్సరీలను సందర్శించి మొక్కలకు నీటిని సక్రమంగా పోయాలని ఆదేశించారు. గ్రామంలో ఇంటింటా పారిశుధ్య పనుల నిర్వహణ, చెత్తసేకరణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

సాగు ప్రణాళిక ఖరారు



- జిల్లాలో 2,76,076 ఎకరాల్లో పంటల సాగు అంచనా
- గత ఏడాది కంటే 3,668 ఎకరాల్లో పెరగనున్న సాగు విస్తీర్ణం
- వరి 2,12,500 ఎకరాలు, పత్తి 52,500 ఎకరాలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

యాసంగి సీజన్ ముగిసింది. వానాకాలం పంటల సీజన్ ప్రారంభం అవుతున్నది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంత విస్తీర్ణంలో ఏఏ రకాల పంటలను సాగు చేయనున్నారు.. ఆ పంటలకు ఎంత ఎరువులు అవసరం కానున్నాయి.. విత్తనాలు ఎన్ని కావాలి అనే విషయమై జిల్లా వ్యవసాయ శాఖాధికారులు సాగు ప్రణాళిక రూపొందించేందుకు కసరత్తు చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణి కార్తె ఆగమనంతో వానాకాలం సీజన్ ఆరంభం కానున్నది. ఈ మేరకు 25 రోజుల ముందే సాగు ప్రణాళికను సిద్ధం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి, వ్యవసాయ బావులు, బోరు బావులు, చెరువులు, కుంటల కింద 2,76,076 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని అంచనా వేశారు. వానాకాలంలో 2,72,678 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది అదనంగా 3,368 ఎకరాల్లో సాగు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేశారు.

జిల్లాలో అత్యధికంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలనే సాగు చేస్తున్నారు. వానాకాలంలో 2,12,500 ఎకరాల్లో వరి, 705 ఎకరాల్లో మొక్కజొన్న, ఐదెకరాల్లో పెసర, ఐదెకరాల్లో మినుము, 250 ఎకరాల్లో కంది, పదెకరాల్లో వేరుశెనగ, ఐదు ఎకరాల్లో నువ్వులు, 52,500 ఎకరాల్లో పత్తి, 10,086 ఎకరాల్లో మిర్చి, పసుపు, ఆయిల్ పామ్, కూరగాయల పంటలు సాగు కానున్నాయని అధికారులు అంచనా వేశారు. ఈ పంటల సాగుకుగాను 32,447 మెట్రిక్ టన్నుల యూరియా, 7,900 టన్నుల డీఏపీ, 23,453 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 6,331 పొటాష్ ఎరువులు, 600 టన్నుల సూపర్ సల్ఫేట్ ఎరువులు, మొత్తం 70,731 టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద 9,663 టన్నుల ఎరువులు, ప్రైవేట్‌లో 8,478 టన్నులు, ఆయా సొసైటీల్లో 571 టన్నులు, వివిధ కంపెనీల గోడౌన్లలో 2,926 టన్నులు, మొత్తం 21,638 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వరి విత్తనాలు 53,125 క్వింటాళ్లు, పత్తి 1,31,250 ప్యాకెట్లు, మొక్క జొన్న 70.5 క్వింటాళ్లు, కంది 10 క్వింటాళ్లు, ఇతర పప్పు దినుసులు 1.6 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. ప్రస్తుతానికి జిల్లాలో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు.

సాగు పనుల్లో నిమగ్నం అవుతున్న రైతులు..

యాసంగి వరి కోతలు పూర్తి కావడంతో కొంత మంది రైతులు ధాన్యాన్ని విక్రయించుకోగా, మరి కొంత మంది రైతులు కల్లాల్లో, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోశారు. మిగతా రైతులు వేసవి దుక్కుల పనులు చేపడుతున్నారు. వర్షాధారంగా సాగయ్యే పత్తి, మొక్కజొన్న, నువ్వులు, పెసర, బబ్బెర, తదితర పంటలను సాగు చేసేందుకు గాను వేసవి దుక్కులు దున్ని భూములను చదును చేస్తున్నారు. ట్రాక్టర్లతో దుక్కులను దున్నుతున్నారు. జూన్‌లో కురిసే తొలకరి జల్లులకు మరొకసారి దుక్కి దున్ని అచ్చు కొట్టి విత్తనాలు వేయనున్నారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు పొలాల్లో పెద్దగా ఉన్నటువంటి వరి కొయ్యలను కాలుస్తున్నారు. మృగశిర కార్తెలో గానీ, ఆరుద్ర కార్తెలో గాని వరి నార్లు పోసేందుకు రైతులు విత్తనాలు సేకరిస్తున్నారు. ఈసారి ముందస్తుగానే నైరుతి రుతు పవనాలు వస్తాయని, వర్షాలు బాగానే పడతాయని వాతావరణ కేంద్రం నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది ఆశించిన మేరకు వర్షాలు పడడంతో రెండు సీజన్లలో పంటలు సాగయ్యాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండాయి. ఈసారి కూడా భారీ వర్షాలు కురిస్తే అవి నిండనున్నాయి. ఈ ఏడాది కూడా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలకు అవకాశం లేదు.

అందుబాటులో 30 క్వింటాళ్ల పెసర విత్తనాలు..

వానాకాలం సీజన్‌కు ముందు పెసర పంట సాగు చేసేందుకు వీలుగా 30 క్వింటాళ్ల ఐపీఎం-410-3 (శిఖా)

మిగతా 8వ పేజీలో

కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

కోల్‌సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్టు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కమిషనరేట్ 7(1), 2016 యాక్ట్, సిటీ పోలీస్ యాక్ట్ ఫస్ట్ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, 1861 ప్రకారం మే 1వ తేదీ నుంచి జూన్1వ తేది వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. కమిషన రేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, నిర్వహించకూడదన్నారు. కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందస్తు పోలీస్ అనుమతి తీసుకోవాలన్నారు. బంద్‌ల పేరిట వివిధ కారణాలు చెబుతూ బలవంతంగా వివిధ సంస్థలను, కార్యాలయాలను మూసివేయాలని బెదిరించినా, ఒత్తిడి చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజేలు, డ్రోన్‌లపై నిషేదం మరో నెల రోజుల పాటు పొడిగించినట్టు కమిషనర్ పేర్కొన్నారు. ఈ మేరకు సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

గర్రెపల్లిలో వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

సుల్తానాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి గ్రామంలో వాలీబాల్ సమ్మర్ శిక్షణా శిబిరాన్ని జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడు కన్న రమేష్ ప్రారంభించారు. గర్రెపల్లి జడ్పీ హైస్కూల్ మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కన్న రమేష్ మాట్లాడుతూ ప్రతీ ఏటా వేసవి సెలవుల్లో గర్రెపల్లిలో ఉమ్మడి జిల్లాస్థాయి సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేస్తూ సీనియర్ వాలీబాల్ క్రీడాకారులతో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు, పీఈటీ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమ్మర్ క్యాంపు ప్రారంభం



నిట్టూరులో సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం సమ్మర్ క్యాంపును ప్రధానోపాధ్యాయులు రాజమణి ప్రారంభించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు 40 రోజుల పాటు కొనసాగుతుందని , ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పీ కుంభాల సుధాకర్, వాలంటీర్ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలిగేడు: ఎలిగేడు మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 156మంది విద్యార్థులు సమ్మర్ క్యాంపులకు హాజరయ్యారని ఎంఈవో అనసూరి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంద్ర దేవేందర్‌రావు, ధూళికట్ట హెచ్‌ఎం బిజిలి సదయ్యలు తెలిపారు. వలంటీర్స్ విద్యార్థులకు గణిత సామార్థ్యాలతో పాటు ఆటలు, డ్రాయింగ్, పేయింటింగ్‌లను నేర్పుతున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పి లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంపును శ్రీరాంపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నరెడ్ల సునీత, ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో వాలంటీర్ సంధ్య, పాఠశాల పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంథనిరూరల్: మండలంలోని ఖానసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఖానాపూర్, ఆరెంద, భట్టుపల్లి, అడవిసోమన్‌పల్లి, నాగెపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తారని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్, సీఆర్‌పీ మల్లన్న, వలంటీర్ స్వరూప పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్థిరత్వమే ప్రభుత్వ లక్ష్యం

- మంథనిలో 410 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా తమ ప్రజాప్రభుత్వం సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీపాద కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం, ఇందిరా మహిళ శక్తి మొబైల్ క్యాంటీన్, మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ వేర్ మ్యాచింగ్ సెంటర్‌ను మంత్రి శ్రీధర్‌బాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆదాయ మార్గాలు పెరగాలని, వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకంలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్ కేంద్రాలు, మొబైల్ క్యాంటీన్స్, పలు వ్యాపార యూనిట్ల స్థాపన కోసం కృషి చేస్తున్నామన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన శ్రీపాద మహిళ కుట్టు మిషన్ కేంద్రం ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు యూనిఫాం తయారిని ప్రభుత్వం మహిళలకు అప్పగించిందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడం కోసం మంథనిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాన్నారు. మహిళలు వ్యాపార విస్తరణలో ఎలాంటి కార్యాచరణ తీసుకున్నా ప్రభుత్వపరంగా పూర్తిసహకారం అందిస్తామని తెలిపారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, దీని ద్వారా అనేక మంది మహిళలు లబ్ది పొందుతున్నారన్నారు. మంథని పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలకు తొలి జాబితాలో 410 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇళ్ల స్థలం లేని వారికి కూడా ఇళ్లు పంపిణీ చేసేందుకు స్థలం గుర్తించే కార్యక్రమం కలెక్టర్, ఆర్డీవోల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. మహిళలు అర్థికంగా ఎదిగేందుకు పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమారస్వామి, మున్సిపల్‌కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.



మొబైల్ క్యాంటీన్‌ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

లేబర్ కోడ్స్ అమలును అడ్డుకుంటాం

- ఈ నెల 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె - సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

పెద్దపల్లి టౌన్/సుల్తానాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను అడ్డుకుంటామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. లేబర్ కోడ్స్ అమలుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈనెల 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మే డే పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో, సుల్తానాబాద్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఈ సభలో భూపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వాల విధానాలు కార్మికుల సమ్మె హక్కులను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కార్మిక వ్యతిరేక అంశాలు అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని వీటిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఈనెల 20న జయప్రదం చేయాలన్నారు. సభలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, రైస్ మిల్లు గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు పోగుల తిరుపతి, ఆపరేటర్స్ నేతలు బ్రహ్మచారి, వీరోగని కిరణ్, వేగోళం శంకర్ గౌడ్,భగవాన్, తిరుపతి రెడ్డి, మంజూర్, అంజయ్య, గున్నాల అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

కార్మిక చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

- జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం అమలు చేస్తున్న కార్మిక చట్టాల గురించి అవగాహన కలిగిఉండాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ చౌరస్తా వద్ద అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సును జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతు పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయసేవాధి కార సంస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని న్యాయం కోసం మండల సంస్థను ఆశ్రయించాలని సూచించారు. పలువురు సీనియర్ న్యాయవాదులు వివిధ చట్టాల గురించి సభలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మున్సిపల్ కార్మికులను జడ్జి సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియోషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకల తిరుపతి రెడ్డి, బోయిన భూమయ్య, ఏజీపీ దూడం అంజనేయులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ మెంబర్ సభ్యులు మాదూరి అంజనేయులు, చీకిటి సంతోష్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్, న్యాయవాదులు వొడ్నాల రవీందర్, జోగుల రమేష్, సత్యనారాయణ, సామల రాజేంద్ర ప్రసాద్, గుడ్ల వెంకటేశ్, మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు పాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి గణేష్

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం



భారీ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

కులగణనను స్వాగతిస్తున్నాం..

సుల్తానాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో కులగణన కోసం కేంద్ర నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ యాదవ్ తెలిపారు. గురువారం ఆయన సుల్తానాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీఎస్పీ అధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం, కులగణన కోసం అనేక పోరాటాలు ఆందోళనలు నిర్వహించామని వివరించారు.

జనాభా ప్రకారంగా అన్ని రంగాల్లో వాటాలు ఉండాలని లేకుంటే రాజ్యాంగ ఫలాలు అందరికీ దక్కవన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెలి బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి విద్యార్థులకు ఘన సన్మానం

పెద్దపల్లి, టౌన్ మే 1 (ఆంధ్రజ్యోతి) పదవ తరగతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం పెద్దపల్లి జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ వల్స నీలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో పదో తరగతిలో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలను సేకరించి వారిని ఘనంగా సన్మానిస్తామని తెలిపారు. ఉన్నత లక్ష్యంతో చదివి చక్కటి స్థానాలలో ఉండాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఇతర వివరాలకు 8500473999, 9849609601, 9848107399 నంబర్లలో సంప్రదించగలరని కోరారు.

గోదాంకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

● టెంట్లు, డెకోరేషన్ సామగ్రి దగ్ధం

● రూ.10లక్షలు వరకు నష్టం



కాలిపోయిన సీలింగ్ టెంట్లు, డెకోరేషన్ సామగ్రి

ధర్మపురి, మే 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పెద్దనక్కలపేటకు వెళ్లే దారిలో ఉన్న ఎండీ షబ్బీర్ గోదాంకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున నిప్పంటించారు. దీంతో గోదాంలో నిల్వ ఉంచిన టెంట్ హౌస్‌కు చెందిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రూ 10 లక్షలు పైగా భారీ నష్టం వాటిల్లింది, వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రహమత్‌పురాకు చెందిన ఎండీ షబ్బీర్ పెద్దనక్కలపేట వెళ్లే దారిలో గోదాం గురించి ఒక గది కిరాయి తీసుకుని టెంట్ హౌస్‌కు సంబంధించిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామాగ్రి కిరాయి ఇవ్వడం కోసం నిల్వ ఉంచారు. తెల్లవారుఝామున గోదాం ఎదురుగా కిరాణం షాపు నడుపుతున్న పోలవేని తిరుపతి సుమారు 3 గంటల సమయంలో నిద్ర లేచి చూసే సరికి టెంట్ హౌస్ గోదాం కాలిపోతుందని ఫోన్ చేసి షబ్బీర్‌కు తెలిపాడు. వెంటనే షబ్బీర్ అక్కడికి చేరుకుని ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేసి తెప్పించి మంటలను ఆర్పివేయించారు. గోదాంలో భద్రపరిచిన టెంట్లు, సీలింగ్ టెంట్లు (150), డెకోరేషన్, ప్లాస్టిక్ సామగ్రీ కాలి బూడిద అయ్యింది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుడు ఎండీ షబ్బీర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


అబ్దుల్ కలాం విగ్రహంపై పట్టింపేది?



గుర్తుపట్టరాని విధంగా ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం

తిమ్మాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహం గుర్తుపట్టరాని విధంగా ధ్వంసమైంది. నిత్యం పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులు సైతం కలాం విగ్రహాన్ని పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా పాఠశాల ఆవరణలోనే జరుగుతున్నా విగ్రహం వైపు కన్నెత్తిచూడక పోవడం శోచనీయం. పాఠశాల పరిసరాలు రాత్రయితే మందుబాబులకు అడ్డాగా మారుతాయి. దీంతో వారే విగ్రహం ధ్వంసం చేశారా.. లేదా ఇంకెవ రైనా చేశారా అనేది తెలియని పరిస్థితి. ఏది ఏమైనా స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు సైతం అబ్దుల్‌కలాం విగ్రహం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అబ్దుల్ కలాం విగ్రహానికి మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పని గంటలు లేని నేతన్నలు



ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు భరోసా..

సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలు...

వస్త్ర పరిశ్రమలో 20 వేల మంది కార్మికులు, గార్మెంట్ రంగంలో 5 వేల మందికి ఉపాధి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మరమగ్గాలే వాళ్లకు లోకం. నిత్యం నేత పనిలోనే జీవితం. కానీ 8 గంటలకు బదులు 12 గంటలు ఉపాధి కోసం మరమగ్గాల చప్పుళ్ల మధ్య నలిగిపోతున్నారు. కూలి ఒప్పందాల సమయంలో కార్మికులకు 8 గంటల పనివిధానం అమలు చేస్తామని యాజమాన్యాలు రాసుకున్న ఒప్పందాలు అమలులోకి రాకుండానే పోయాయి. పని గంటల పరిమితి కోసం సాగిన పోరాటంలో కార్మికుల రక్తంతో తడిసి ఎగిరిన ఎర్రజెండాతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులు ఉపాధికోసం గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లను సాధించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ ఆర్డర్లకు ఇబ్బందులు ఏర్పడిన సందర్భంలోనూ కార్మికులు మళ్లీ రోడ్డెక్కడంతో ప్రభుతం బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి మహిళలకు చీరలు ఇతర ఆర్డర్లను ఇచ్చి భరోసాను నింపింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల మరమగ్గాలు, డైయింగ్‌లు, సైజింగ్‌లు, వార్పిన్‌లపై 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న నేతన్న పథకాల పై ఎంతో అశగా నేత కుటుంబాలు ఉన్నాయి. మరోవైపు పని గంటల పరిమితి లేకపోవడంతోనే మానసికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక సంఘాలు 8 గంటల పనివిధానం అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

● నిత్యం బతుకు పోరాటం..

సిరిసిల్ల మగ్గం బతుకులు ఎప్పుడూ ఆగమాగమే. నిత్యం బతుకు పోరాటంగానే సాగుతుంది. పొద్దస్తమానం కష్టపడినా నేతన్నలు ఉపాధి కరువై అప్పుల్లో కూరుకుపోతూనే ఉన్నారు. పడుగు పోగులు, ఉరితాళ్లుగా వేలాడుతుంటే నిత్యం బతుకు చప్పుళ్ల



వినిపించిన మరమగ్గాలు ఎప్పుడూ నేతన్నలు వెక్కిరిస్తూనే ఉంటాయి. ఈక్రమంలో నేతన్నలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ఆర్డర్లు భరోసా కల్పిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అందిన ఆర్డర్లలో మార్పులు తీసుకవచ్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంలో చేసిన జాప్యం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలోకి వెళ్లింది. దాదాపు 15 మందికి పైగా కార్మికులు ఉరి పోసుకున్నారు. వామపక్ష పార్టీలు, పవర్‌లూం కార్మిక సంఘాలు, వస్త్రోత్పత్తి దారుల సంఘాల ఆందోళనల ఫలి తంగా ప్రభుత్వం మళ్లీ స్వశక్తి మహిళల కోసం చీరల ఆర్డర్లు, విద్యార్థులకు యూనిఫాం బట్ట ఉత్పత్తి వంటివి ఇవ్వడంతో ఉపశమనం పొందారు. విద్యుత్ రాయితీ పది హెచ్‌పీల నుంచి 25 హెచ్‌పీలకు పెంచారు. కొంత బకాయిల సమస్య వెంటాడుతుంది. స్వశక్తి చీరలకు రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన యారన్ డిపో ఆధారంగా నిలిచింది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో బీడీలు చుట్టే కార్మికులు, వస్త్రోత్పత్తి రంగంలో ఉన్న మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించడానికి పూనుకుంది. ఆ దిశగానే సిరిసిల్ల శివారులోని సర్దాపూర్- పెద్దూర్‌ల వద్ద మహిళల కోసం గార్మెంట్ రంగంలో పరిశ్రమలు తీసుకవచ్చే దిశగా అపెరల్ పార్కు. పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకం కోసం వీవింగ్ పార్కు, నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అపెరల్ పార్కులో వస్తున్న యూనిట్లతో మహిళలకు ఉపాధి లభిస్తుండగా వర్కర్ టు ఓనర్ పథకం కోసం నేతన్నలు ఎదురుచూస్తూ నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం, నిర్మాణం పూర్తిచేసుకున్న షెడ్లలో ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడంతో పవర్‌లూం కార్మికుల్లో పథకంపై ఆశలు సన్నగిల్లాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.386.88 కోట్లతో పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే పథకాన్ని అమలుచేయడానికి సన్నాహాలు ప్రారంభించడంతో కార్మికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ యాక్షన్ ప్లాన్ ఎంటో కనిపించకపోవడంతో ఎదురుచూపులే మిగిలిస్తున్నాయి.

గార్మెంట్ రంగంలో మహిళా కార్మికులకు ఉపాధి..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్ల పెద్దూర్ శివారులో మహిళా కార్మికుల కోసం 60 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రూ.174 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. అపెరల్ పార్కులో గార్మెంట్ రంగంలో మహిళలకు ఉపాధి లభిస్తుంది. అపెరల్ పార్కులో 2021 ఏప్రిల్‌లో గోకుల్‌దాస్ ఇమేజ్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను ప్రారంభించింది. 800 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ప్రారం భించిన యూనిట్‌ను 1600 మందికి ఉపాధి కల్పించే దిశగా విస్తరించింది. సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికా లాంటి దేశాలకు రేడిమేడ్ వస్త్రాలు ఎగుమతి చేస్తుంది. ఇదేదిశగా బెంగు ళూరుకు చెందిన అంత ర్జాతీయ గార్మెంట్ రంగసంస్థ టెక్స్‌పోర్టు కంపెనీ యూనిట్‌ను ప్రారంభించింది. ఈ కంపెనీ ద్వారా 2వేల మందికి ఉపాధి లభించనుంది.



● 'వర్కర్ టు ఓనర్'కు రూపకల్పన

మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చే దిశగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. 42 వీవింగ్ షెడ్ల నిర్మాణం జరిగింది. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించనున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్ రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం, ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర రూ.8 లక్షలుగా ముందుగా నిర్ణయించారు.

ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.16.52 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో 10 శాతం లబ్ధిదారుడి వాటాధనం, 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకానికి రూపకల్పన చేశారు. సిరిసిల్లలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6,500 మంది పని చేస్తు న్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పనిచేస్తున్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1,104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది.

జ్వరంతో మహిళ మృతి



కనకలక్ష్మి(ఫైల్)

ఓదెల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నాగపూరి కనకలక్ష్మీ(70) అనేమహిళ గురువారం జ్వరంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతవారం ఇంటివద్దనే కనకలక్ష్మికి మెదడు వాపుతోపాటు తీవ్రమైన జ్వరం రావడంతో అస్వస్థతకుగురైంది. వెంటనే కరీంనగర్‌లోని ఓప్రైవేట్‌ఆస్పత్రికి ఆసుపత్రికి తరలించారు. అక్కడివైద్యుల సూచన మేరకు వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగాగురువారం మృతిచెందింది.

ఉప్పుమడుగు సహకార సంఘం కార్యదర్శిపై వేటు

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాయికల్ మండలం ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సంఘ పాలకవర్గానికి ఆయన ఆదేశాలు జారీచేశారు. ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీససౌకర్యాలు కల్పించకపోవడంతోపాటు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో వీరాపూర్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీరాపూర్ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం, డీటీ గణేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి కుమార్‌లు గురువారం సందర్శించి ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని తెలిపారు.

షాపులోకి దూసుకెళ్లిన కారు..

● ధ్వంసమైన సామగ్రి

వేములవాడ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామంలో రోడ్డుపక్కన షాపులోకి కారు దూసుకువెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి గ్రామంలోని కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న షాపులోకి కారు వేగంగా వచ్చి దూసుకెళ్లింది. దీంతో షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. షాపులోని సామగ్రి ధ్వంసమయ్యాయి. కారుడ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

ఎలిగేడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోనగిరి సంపత్(29) అనే యువకుడు మద్యానికి బానిసై ఉరి వేసుకొని మృతిచెందినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మద్యానికి బానిసై రోజూ మద్యం సేవిస్తుండగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. తాగుడు మానుకోకుంటే ఉండనని అతడిభార్య పుట్టింటికివెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సంపత్ మద్యంతాగి బుధవారంరాత్రి ఇంటి డాబాపై పడుకుంటానని చెప్పివెళ్లాడు. గురువారం తెల్లవారుజామున మృతుడితల్లి వెళ్లి చూసేసరికి డాబామీద బట్టలు ఆరవేసుకునే తీగకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి లక్ష్మిఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో హమాలీ మృతి

మంథని, మే 1 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపాలిటీపరిధిలోని గంగాపురి గ్రామంలో వడదెబ్బతో పులి మణి(55) అనేహమాలీ గురువారం మృతిచెందాడు. ఉదయం గంగాపురిలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి హమాలీ పనికి వెళ్లి ఎండలో పనిచేయడంతో ఇంటికి వచ్చిన తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్సకోసం మంథనిలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి గోదావరిఖని ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమా రుడు, కూతురు ఉన్నారు.

కుల బహిష్కరణ: కేసు నమోదు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామంలో ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కుల బహిష్కరణ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన వల్లపు గుట్టయ్యకు చెందిన భూమి పంచాయతీ విషయంలో కుల సంఘం చెప్పినట్లుగా గుట్టయ్య వినడం లేదని దీంతో అతన్ని బూతులు తిడుతూ కుల బహిష్కరణ చేశారన్న ఫిర్యాదు మేరకు సంఘం సభ్యుల మీద కేసు నమోదు చిసినట్లు ఎస్సై తెలిపారు.

సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ భాగస్వాములు కావాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్



సిరిసిల్లలో సీఐటీయూ బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

సిరిసిల్ల రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల20న చేపట్టే సార్వతికసమ్మెలో కార్మికులందరు భాగస్వాములు కావాలని, మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సీఐటీయూ జిలా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లేబర్‌అడ్డా, రైతుబజార్, మున్సిపల్ కార్యాలయం, జిల్లాఆసుపత్రి, నేహ్రూనగర్, చంద్రంపేట, గణేష్‌నగర్, బీవై నగర్ ఏరియాలల్లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం బీవైనగర్‌లో చేపట్టిన బహిరంగ సభలో మేడే అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మేడే అమరవీరులు సాధించిన హక్కులను నేటి కేంద్ర బిజెపి సర్కార్ హరించి వేస్తుందని ఆ హక్కుల రక్షణ కోసం మే20న జరుగు సార్వత్రికసమ్మెలో అన్నిరంగాల కార్మికులు, కష్టజీవులు భాగస్వాములుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు ఉదయం 10గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటికి వస్తున్నారంటే కారణం నాడు మేడే కార్మికులు చిందించిన రక్తం నేనని అన్నారు. అందులో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికులు పోరాడి సాధించుకుంటున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ కార్పొరేట్ దిగ్గజాలకు కార్మికుల కష్టార్జితాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ సర్కారు ఒక కలం పోటుతో రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం పీఎఫ్ ఈఎస్‌ఐ వంటి కనీస హక్కులు కూడా లేవన్నారు. బీజేపీపాలిత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచిందన్నారు. మే20న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చేస్తున్న సమ్మెతో మోదీ మెడలు వంచి కార్మికవర్గ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, మూషం రమేష్, అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, రాపెల్లి రమేష్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, గుండు రమేష్, కుడిక్యాల కనకయ్య , బెజుగం సురేష్, ఎక్కల్‌దేవి జగదీశ్, ఉడుత రవి, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్, సుల్తాన్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రీల్స్ చేస్తూ నీటిలో మునిగి యువకుడి మృతి



మహ్మద్ అర్బాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ అర్బాస్(20) అనే యువకుడు రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వాగునీటిలో మునిగి గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరు స్నేహితులతో కలిసి అర్బాస్ నగర శివారులోని మానేరువాగు నీటిలోకి దిగి రీల్స్ వీడియో తీసుకుంటున్నారు. ఆ సమయంలో మరింత లోతుకు వెళ్లిన అర్బాస్ ప్రమాదవశాత్తుగా నీటిలోపడి మునిగిపోయాడు. స్థానికుల సహాయంతో అర్బాస్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు రోజులుగా చెట్ల పొదల్లో వృద్ధురాలు

● గమనించి అధికారులకు సమాచారం ఇచ్చిన యువకులు ● సఖి కేంద్రానికి తరలింపు



వృద్ధురాలిని సఖి కేంద్రానికి తరలిస్తున్న డీడబ్ల్యూవో నరేష్, స్థానిక యువకులు

గొల్లపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట-శంకర్రావుపేట గ్రామరెవెన్యూ పరిధిలోని సాంబశివునిబోరులో దారుణం చోటుచేసుకుంది. హృదయవిదారకమైనస్థితిలో ఓ వృద్ధురాలిని చెట్ల పొదల్లో వదిలివెళ్లడంతో మూడురోజులుగా అచేతన స్థితిలో చావుబతుకుల మధ్య కొట్టాడుమిట్టాడింది. అటువైపువెళ్లిన యువకులు వృద్ధురాలి దీనస్థితిని గమనించి జిల్లా సంక్షేమశాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి బోనగిరి నరేష్ హుటాహుటిన సంఘటనస్థలికి వచ్చి వృద్ధురాలిని సఖికేంద్రానికి తరలించిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికయువకులు, సంక్షేమశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురాకు చెందిన వేల్పుల బూదవ్వ అనే వృద్ధురాలు మూడురోజుల క్రితం గొల్లపల్లి మండలం శ్రీరా ములపల్లె గ్రామంలోని ఐకేపీకేంద్రం వద్ద రాత్రి పొద్దు పోయాక ఒంటరిగా నడవలేనిస్థితిలో ఓ చోట అచేతన స్థితిలో పడిఉంది. గమనించిన స్థానిక యువకుడు ఎనుగుల మహేష్ ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డులోని ఫోన్‌నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారమందించాడు. వృద్ధురాలికి ఉన్న ఒక్కగానొక్క కూతురు ఫోన్‌ఎత్తి మాకేం సంబంధం లేదంటూ ఫోన్ కట్‌చేసింది. మూడురోజుల అనంతరం శంకర్రావుపేట-మల్లన్నపేట గ్రామాల రెవెన్యూ సరిహద్దులోని సాంబశివుని గుట్టకు ఉన్న చెట్లపొదల మధ్య దీనమైనస్థితిలో పడి ఉండడాన్ని కొందరు అటుగా వెళ్లిన యువకులు గమనించి శ్రీరాములపల్లెకు చెందిన బీఆర్‌ఎస్ యువనాయకులు సల్లూరి శోభన్‌గౌడ్‌కు సమాచా రమందించారు. మరికొందరు యువకులు, స్థానికులతో కలిసి బుధవారం రాత్రి సాంబశివుని బోరుకు చెట్లపొదల్లో వృద్ధురాలి ఆచూకీ కోసం గాలించి ఎట్టకేలకు గుర్తించి జిల్లా సంక్షేమశాఖ అధికారికి సమాచారమందించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్ తన సిబ్బందితో తరలివచ్చి వృద్ధురాలిని జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించిన అనంతరం సఖి కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

పూర్తిగా నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధురాలు శ్రీరాములపల్లె ఐకేపీ కేంద్రం నుంచి సుమారు 2కిలోమీటర్ల దూరంలోఉన్న సాంబశివుని బోరుకు ఎలా వెళ్లిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. వృద్ధురాలి కూతురు తన భర్త, పిల్లలతో కలిసి గుట్టబోరుకు వదిలివెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీడబ్ల్యూవో భోనగిరి నరేష్, ఎఫ్‌ఆర్‌వో మతులాపురం కొండయ్య, డీసీపీవో హరీష్, జెండర్ స్పెషలిస్ట్ బోయపోతు గౌతమి, సఖి కేంద్రం సిబ్బంది రజిత, స్థానికులు సల్లూరి శోభన్ గౌడ్, శ్రీకోటి రఘుపతి, గడ్డం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్న భూమి లాక్కుని వృద్ధురాలి గెంటివేత

వేల్పుల బూదమ్మకు ఇస్లాంపురాలో సొంత ఇల్లుతో పాటు ఎకరం వ్యవసాయ భూమి ఉండగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ఉంటున్న కూతురు ఇటీవలే భూమని తన పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా 15 రోజుల అనంతరం వృద్ధురాలిని చితకబాది ఇంటిలో నుంచి గెంటివేయడంతో వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోయి బయటికి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. శ్రీరాములపల్లె యువకుడు వృద్ధురాలి ఆచూకీ తెలపడంతో రాత్రిపూట వచ్చి గుట్టబోరుకు వదిలివెళ్లినట్లు అధికారులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిదో రోజుకు స్వర్ణకారుల రిలేదీక్షలు

● మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



ముస్తాబాద్‌లో స్వర్ణకారుల రిలేదీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఎదుట కొనసాగుతున్న స్వర్ణకారుల రిలే దీక్షలు గురువారం ఎనిమిదో రోజుకు చేరాయి. దీక్షలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో నాయకులు సంఘీభావం తెలిపారు. కుల వృత్తులను కాపాడుకోవాలని, చేతివృత్తుల మీద జరుగుతున్న దాడికి నిరసనగా రిలే దీక్షలు జరగుతున్నాయన్నారు. స్థానికంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న జ్యువెలరీ షాప్‌ను పెట్టవద్దని షాప్‌ను పెట్టడం ద్వారా స్వర్ణకారుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారులు చింతోజు బాలయ్య, రాజు, ఈశ్వరయ్య, రవి, సత్యం, రఘు, వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జెల రాజు గుండెల్లి శ్రీనివాస్, దీటి నర్సింలు, ఉచ్చిడి బాల్‌రెడ్డి, రంజాని నరేశ్, మిరుదొడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యం, ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఒంటరితనం భరించలేక వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన కేంశెట్టి మహేష్(57) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహేష్ కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ శోభాయాత్ర



ముత్యంపేటలో పెద్దమ్మతల్లి శోభాయాత్రను నిర్వహిస్తున్న గ్రామస్థులు

మల్లాపూర్, మే, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం జాతరలో భాగంగా పెద్దమ్మతల్లి విగ్రహాన్ని శోభ యాత్రగా ఆలయానికి ఘనంగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మ వారిని డప్పు చప్పుల్ల మధ్య శోభ యాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు తదితరులు పాల్గొన్నారు. జాతర వేడుకలు ఈనెల 4వ తేదీ వరకు ఘనంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

భూమి ఆక్రమించారని రైతు ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి(45) అనేరైతు భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించారని మనస్థాపానికి గురై పురుగులమందు తాగి గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోరండ్ల గ్రామానికి చెందిన మల్లారెడ్డిని అతడి భార్య అనూషను అదే గ్రామానికి చెందిన పడిగెల గంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, రాజవ్వ, రమ అనే వ్యక్తులు గత కొంతకాలంగా ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా, పోరండ్ల గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద గల భూమిని మల్లారెడ్డి ఈనెల 27వ తారీఖున చదునుచేయుటకు వెళ్లగా అరుగురు వ్యక్తులు మల్లారెడ్డిని భూమివద్దకు వస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో అప్పటినుంచి మనస్థాపానికి గురైన మల్లారెడ్డి గురువారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సాయంత్రం మల్లారెడ్డి మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మామిడి మార్కెట్‌లో ఫీజు ఎగవేత



జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ

- ప్రతి యేటా రూ. కోట్లలో వ్యాపారం
- మార్కెట్ ఆదాయం మాత్రం రూ. అరకోటి లోపే
- జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల గోల్‌మాల్
- కట్టడి చేస్తేనే మార్కెట్‌కు ఆదాయం

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం కొనసాగుతోంది. వ్యాపారుల గోల్‌మాల్ వల్ల మామిడి సీజన్‌లో మార్కెట్ దాదాపుగా రూ. కోటిన్నరకు పైగా నష్టపోతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రతి యేటా రూ. వంద కోట్ల నుంచి రెండు వందల కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందన్న అంచనాలున్నాయి. కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి దాదాపుగా రూ. అరకోటి ఆదాయం మాత్రమే లభిస్తోంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు నిర్వహించిన కొనుగోళ్లలో మార్కెట్ కమిటీకి ఒక్క శాతం ఫీజు రూపేనా చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో రూ. కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ మార్కెట్ ఫీజు మాత్రం అంతంతమాత్రంగానే చెల్లిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు తగిన ఆదాయం రావడం లేదు. గత 17 సంవత్సరాల క్రితం ఏర్పాటయిన జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌కు యేటా రూ. 50 నుంచి రూ. 60 లక్షల లోపు మాత్రమే ఆదాయం వస్తోంది.



విక్రయానికి వచ్చిన మామిడి కాయలు

జగిత్యాలలో మామిడి మార్కెట్ పరిస్థితి ఇలా

జగిత్యాల శివారులోని చల్‌గల్ మామిడి మార్కెట్‌ను 2005 సంవత్సరంలో సుమారు 23 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. గత యేడాది రూ. 10 కోట్లు వెచ్చించి యార్డులో మామిడి మార్కెట్‌కు అవసరమైన షెడ్డులను నిర్మించారు. మామిడి కాయల కొనుగోలుకు యార్డు పరిధిలో 88 మంది కమీషన్ ఏజంట్లు, 59 మంది అడ్తి వ్యాపారులు న్నారు. దీనికి తోడు ఎటువంటి లైసెన్సులు లేకుండా సుమారు పాతిక మంది వరకు వ్యాపారం నిర్వహి స్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి యేటా జగి త్యాల మామిడి మార్కెట్‌కు సుమారు 5 వేల మంది కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారన్నారు. వ్యాపారులు ప్రతి సీజన్‌లో సుమారు రూ. 100 కోట్ల నుంచి రూ. 200 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తుంటారు.

ఇతర రాష్ట్రాలకు మామిడి తరలింపు

జగిత్యాల నుంచి మామిడి కాయలను ఢిల్లీ, జమ్మూ, కశ్మీర్, చండీఘడ్, హర్యానా, పంజాబ్, నాగ్‌పూర్ వంటి రాష్ట్రాలకు లారీల్లో తరలిస్తుంటారు.

అంతంతమాత్రంగానే ఆదాయం

జగిత్యాల మామిడి మార్కెట్‌లో గత యేడాది రూ. 63.29 లక్షల ఫీజు మాత్రమే వసూలైంది. 2022-23 సీజన్‌లో రూ. 43.28 లక్షలు ఫీజు వసూలైంది. అదే విధంగా 2021-22 సంవత్సరంలో రూ. 60.90 లక్షలు, 2020-21 సంవత్సరంలో 91.70 లక్షలు, 2019-20 సంవత్సరంలో రూ. 69.65 లక్షలు, 2018-19 సంవత్సరంలో రూ. 64.01 లక్షలు, 2019-18 సంవత్సరంలో 71.89 లక్షలు మార్కెట్ ఫీజు వసూలు అయినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. మార్కెట్ లైసెన్స్ తీసుకోవడానికి, నిర్ణీత ఫీజు చెల్లించడానికి వ్యాపారులు పెద్దగా ఆసక్తిచూపడం లేదు.

నోటీసులు జారీ చేసినా రాని ఫలితం

మార్కెట్ యార్డులకు రైతులు తీసుకొని వచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు చేపట్టే లావాదేవీల ఆధారంగా మార్కెట్ యార్డుకు సెస్ చెల్లిస్తారు. మార్కెట్ ఫీజు చెల్లింపు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. గత యేడాది యార్డులో ప్రారంభించిన షెడ్లలోనే మామిడి కాయల కొనుగోళ్ల జరపాలని, యార్డు వెలుపల క్రయ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు పట్టించుకోకుండా యార్డు వెలుపలనే కొనుగోళ్ల ప్రారంభించారు. అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం రావడం లేదు. మార్కెట్ ఫీజు ఎగవేయడానికే వ్యాపారులు ఎత్తులు వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకొని ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన అవసరముందని రైతులు కోరుతున్నారు.

ప్రతి నిత్యం 20 నుంచి 30 లారీల్లో మామిడికాయలు వివిధ ప్రాంతాలకు తరలిపోతుంటాయి. పెద్ద లారీల్లో సుమారు 12 నుంచి 15 టన్నుల మామిడి కాయలను తరలిస్తుంటారు. గత నాలుగు, ఐదేళ్లగా సగటున టన్నుకు రూ. 30 వేల వరకు మామిడి ధర పలికింది. టన్నుకు రూ. 30 వేల చొప్పున 15 టన్నులకు రూ. 4.50 లక్షలు అవుతోంది.

వ్యాపారులు మార్కెట్‌కు ఒక్క శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో లారీకి రూ. 4,500 ఫీజు చెల్లిం చాలి. ప్రతి రోజు 30 లారీల్లో మామిడి కాయలు తరలితే సుమారు రూ. 1.62 లక్షలు ఫీజు రూపేనా మార్కెట్‌కు ఆదాయం రావాల్సి ఉంది. దాదాపుగా నాలుగు నెలల పాటు మామిడి మార్కెట్ కొనసాగుతోంది. ఈ లెక్కన రూ. కోటిన్నరకు పైగా మార్కెట్‌కు మామిడి వ్యాపార ఆదాయం చేకూరాలన్న అంచనా ఉంది. దీనికి తోడు మామిడి కాయ ధరలు పెరిగిన సందర్భాల్లో దాని ప్రకారం ఫీజు అధికారులు వసూలు చేయాలి. కాగా వ్యాపారులు అధిక రేటుకు మామిడి కాయలు కొనుగోలు చేసినప్పటికీ తక్కువ రేటుకు కొనుగోలు చేశామని గోల్‌మాల్ చేస్తూ ఆ మేరకు మాత్రమే అధికారులకు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారు. అధికారులకు పరిస్థితి తెలిసిన ప్పటికీ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా మార్కెట్ ఆదాయం కోల్పోవలసి వస్తోంది.

చర్యలు తీసుకుంటాం

ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జగిత్యాల



జగిత్యాలలోని మామిడి మార్కెట్‌లో వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసు కుం టాం. మార్కెట్ ఆదాయానికి గండి కొట్టే వ్యాపా రులను గుర్తిస్తాం. ఎప్పటికప్పుడు క్రయవిక్రయాల పై పర్యవేక్షణ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటాం.

ఇటలీ వధువు.. వేములవాడ వరుడు..

- సంప్రదాయ పద్ధతిలో ఘనంగా వివాహం



నూతన జంటను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇటలీ దేశానికి చెందిన యువతి.. వేములవాడకు చెందిన యువకుడు హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన ఓలిమినేని నిత్యానందరావు-వీణారాణి దంపతుల కుమారుడు శ్రీకర్‌రావు ఫ్రాన్స్ దేశంలో ఉన్నతవిద్య అభ్యసించాడు. ఆ క్రమంలో ఇటలీకి చెందిన వైద్యురాలు ఫెదిరికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రాత్రి స్థానిక మహారాజ ఫంక్షన్‌హాల్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో వేద మంత్రాల సాక్షిగా వారిద్దరూ ఒకటయ్యారు. వివాహానికి వధువు తరపున ఇటలీనుంచి సుమారు 25మంది బంధుమిత్రులు హాజరయ్యారు. నూతనవధూవరులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీఎమ్మెల్యే రేగులపాటి పాపారావు తదితరులు ఆశీర్వదించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమై నెల రోజులైనా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించడం లేదని జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన రైతులు గురువారం జగిత్యాల-రాయికల్ ప్రధాన రహదారిపై ఉప్పుమడుగు స్టేజీ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కోసి ధాన్యాన్ని కుప్పలు పోసి చాలా రోజులవుతున్నా అధికారులు కొనుగోళ్ల ప్రారంభించలేదని మండిపడ్డారు. అకాల వర్షాలు పడి ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై సుధీర్ రావులు చేరుకుని రైతులతో మాట్లాడి కొనుగోళ్ల ప్రారంభిస్తామని చెప్పి ఆందోళనను విరమింపజేశారు.

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చిరుతల రామాయణం కళాకారులు

వెల్గటూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం రాత్రి ముత్తునూరు గ్రామంలో ప్రదర్శించిన ఆధ్యాత్మిక కార్యక్రమం చిరుతల రామాయణం పట్టాభిషేకంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రేక్షకుల మధ్యన నాయకులతో కలిసి కూర్చుని చిరుతల రామాయణం లోని పాత్రలు, సన్నివేశాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ రామాయణం గొప్పదనాన్ని, శ్రీరాముడి గొప్పదనాన్ని చిరుతల రామాయణం రూపంలో గ్రామీణ ప్రాంతం వారికి అర్థమయ్యే రూపంలో కళాకారుల ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు. కళాకారులకు పది వేల రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోల్ల తిరుపతి, అనుమాల మంజుల, సందీప్‌రెడ్డి, ఎలుక రాజు, శ్రీకాంత్‌రావు, తిరుమలేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే

- ఎమ్మెల్సీ సురభి వాణిదేవి



దుద్దెనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

సైదాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు. గురువారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, సోమారం, లక్ష్మన్నపల్లి, ఆరెపల్లి, ఎక్లాస్‌పూర్, దుద్దెనపల్లి గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశస్వాతంత్రం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లాంటి వారిని నేటియువత ఆదర్శంగా తీసుకొని స్వంతంగా ఎదుగుతూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. యువత మత్తుకు, మద్యానికి, ఇతర చెడు వ్యసనాలకు బానిసలై అర్థాంతరంగా చనిపోతున్నారన్నారు. రానున్న రోజుల్లో దేశంలో యువత యొక్క సంఖ్య గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. మనపిల్లలను చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా డ్రగ్స్ లాంటి మత్తు మహమ్మారిని మన గ్రామాల్లోకి రాకుండా పోరాటంచేసి యువతను కాపాడాలని మహిళ లోకాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కుమార స్వామి, హుస్నాబాద్ నియోజకవర్గ జేపీసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, జేపీసీ కో-ఆర్డినేటర్ డ్యాగల సారయ్య, ఎదులాపురం తిరుపతి, చెప్యాల ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, గాండ్ల పద్మ, జగదీష్, కుమారస్వామి, ఆశీర్వాదం, ప్రభాకర్, ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమారస్వామి, రాజిరెడ్డి, రాజయ్య, యుగంధర్, రవీందర్, రాజేందర్, రజిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. మే డే సందర్భంగా సెలవురోజు కావడంతో రాజన్న ఆలయానికి భక్తులు తరలి వచ్చి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

ఆలూరులో ఘనంగా పోచమ్మ బోనాలు

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఇంటికో బోనంతో ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం వద్ద నైవేద్యాలు సమర్పించారు. అలాగే దావత్ పూజారులు మేకను గావుపట్టారు. పిల్లాపాపా, గొడ్డూగోదాను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, యువకులు తదిత రులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న పూజారులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

జాతీయ కవి సమ్మేళనానికి దేవానందం



దేవానందం

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో ఈనెల8న హైదరాబాద్, త్యాగరాయ గాన సభలో జరిగే జాతీయ కవిసమ్మేళనంలో సిరిసిల్లకు చెందిన ప్రముఖకవి బూర దేవానందంకు కవితాగానం చేయడానికి ఆహ్వానించారు. తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో నిర్వహించే భాష సదస్సు, కవిసమ్మేళనంలో కవి తను వినిపించనున్న దేవానందంను సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం, జిల్లా మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, కవులు, రచయితలు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టాక్టర్ డ్రైవర్,ఓనర్ రావణ వేణి సదయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలి



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి

గణేశ్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): ఐకార్ నుంచి అనుమతులు లేకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి ఉందనే పేరుతో నిర్వహిస్తున్న ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి కోరారు. గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ యూనివర్సిటీల్లో అగ్రికల్చర్ కోర్సులను ఉన్నాయని చెబుతూ విద్యార్థులను, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తూ అడ్మిషన్లు చేపడుతున్న కావేరీ యూనివర్సిటీ ఇతర ప్రైవేట్ యూనివర్సిటీల గుర్తింపు రద్దు చేయాలని, తక్షణమే కేసులు నమోదు చేయాలని అన్నారు. అనుమతులు తీసుకోకుండా విద్యార్థులను యూనివర్సిటీలో చేర్చుకోవడంతో చదువుల పూర్తయిన తర్వాత వచ్చే సర్టిఫికెట్‌తో ఎలాంటి ఉపయోగముండదన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాలకు అనర్హులుగా ఉంటారని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలన్నారు. అనంతరం సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ మాట్లాడుతూ దీనిపై తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు సుమన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

- జిల్లా వ్యాప్తంగా రెపరెపలాడిన ఎర్ర జెండా - గోదావరిఖనిలో 139మీటర్ల జెండాతో ర్యాలీ - హమాలీ కార్మికులకు ఘన సన్మానం






ఎన్టీపీసీలో ఇఫ్టూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు, మేడిపల్లి సెంటరులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మే డే సంబరాలు, హమాలీ కార్మికులను సన్మానిస్తున్న మనాలీ ఠాకూర్

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎర్ర జెండాను ఎగురవేశారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, మే 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఎర్రజెండాను జెండావిష్కరించి 139 మీటర్ల మేడే పతాకంతో భాస్కర్‌రావు భవన్ నుంచి రీగల్ షూమార్టు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు, మడ్డి ఎల్లయ్య, స్వామి, పోషం, రంగు శ్రీనివాస్, మాదన మహేష్, గౌతం గోవర్ధన్ పాల్గొన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జెండావిష్కరించారు. ఈ సందర్భగా డాక్టర్ అప్పారావును ఘనంగా సన్మానించారు. అంబటి సంతోష్‌రావు ఆధ్వర్యంలో కాంట్రాక్టు మహిళా కార్మికులకు చీరలను అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో జెండావిష్కరణ చేశారు. కళ్యాణ్‌నగర్‌లోని హమాలీ సంఘం ఆటో ట్రాలీ ఆధ్వర్యంలో. సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య ఆధ్వర్యంలో మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మేడే దినోత్సవం సందర్భంగా మక్కాన్‌సింగ్‌సేవా సమితి ఛైర్మన్ మనాలీ ఠాకూర్ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్‌లోని హమాలీ సంఘం వద్ద జెండావిష్కరణ చేశారు. అనంతరం హమాలీ కార్మికులను ఘనంగా సన్మానించారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ మార్కెట్ ఏరియాలోని ఐఎఫ్‌టీయూ యూనియన్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళా కళాకారులు, కార్యకర్తలు డప్పులు వాయిస్తూ, నృత్యం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ నరేష్, ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, నాయకులు పాల్గొన్నారు. సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ప్లాంటు వద్ద సంఘం కోశాధికారి దండ రాఘవరెడ్డి ఎర్ర జెండాను ఎగురవేశారు. మేడిపల్లి సెంటరులో సీఐటీయూ రామగుండం, ఎన్టీపీసీ ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, సండే మార్కెట్లో హమాలీ సంఘం నాయకుడు పోచం, కుందనపల్లి యాష్‌పాడులో ఎం రాజమల్లు అరుణ పతాకాలను ఎగురవవేశారు. ఆర్ఐడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల కృషితోనే ప్రగతి పథంలో ఎన్టీపీసీ

జ్యోతినగర్: కార్మికుల కష్టం, కృషితోనే ఎన్టీపీసీ ప్రగతి పథంలో పయనిస్తున్నదని రామగుండం, తెలంగాణ ప్రాజెక్టుల ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. మేడే సందర్భంగా ప్రాజెక్టు ఆవరణలోని మేడే పార్కులో జరిగిన కార్యక్రమానికి ఈడీ ముఖ్య అతిధిగా హాజరై ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌టీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, జీఎంలు ఎకె త్రిపాఠి, సింఘరాయ, ఏజీఎం (హెచ్‌ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

మంథని: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంథని కోర్టులో మేడే వేడుకను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి భవాని కార్మికుల హక్కులపై అవగాహన



మంథనిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భవాని

కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కీర్తిసింహా, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అనురాధ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె హరిబాబు, ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహేందర్‌రెడ్డి, ఏపీపీ సందీప్, ఏజీపీ అంజనేయులు, ఎల్‌వో రవీందర్, న్యాయవాదులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున గురువారం ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహిచారు. కార్యక్రమంలో సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంద రాజేందర్, మాజీ ఎంపీపీలు గోపగోని సారయ్యగౌడ్, నూనేటి సంపత్‌యాదవ్, జడ్పీటీసీలు వంగల తిరుపతిరెడ్డి, లంక సదయ్య, సింగిల్‌విండో ఛైర్మన్ గజవెల్లి పురుషోత్తం పాల్గొన్నారు.

ఓదెల: మండలంలో జరిగిన వేడుకల్లో సీపీఐ మండల కార్యదర్శి కోడెం స్వామి, హమాలి సంఘం కార్యదర్శి సోమిశెట్టి లింగయ్య, సీపీఐ గ్రామ కార్యదర్శులు సూత్రాల స్వామి, తుమ్మల సదయ్య, మండల కౌన్సిల్ సభ్యులు పల్లె గట్టయ్య, రామడుగు వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని కాసులపల్లి, రాగినేడు, కొత్తపల్లి, రాఘవపూర్, రంగాపూర్, బొంపల్లి, అప్పన్నపేటలతో పాటు పలు గ్రామాల్లో హమాలీ కార్మికుల , సీపీఐ, సీపీఎం నాయకులు గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగురవేశారు.

ఎలిగేడు: సుల్తాన్‌పూర్, ధూళికట్ట తదితర గ్రామాల్లో కార్మికులు, కర్షకులు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కార్మిక నాయకులు శ్రీనివాస్, దేవేందర్, కొండయ్య, లక్ష్మణ్, చంద్రయ్య, రమేష్, నర్సయ్య, సరిన్, సత్యనారాయణ, రవీందర్, మల్లయ్య, సతీష్, ఓదెలు, సమ్మయ్య, రాములు, కొమురయ్య, లచ్చయ్య శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్: సీపీఐ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్రా సదానందం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో చంద్రగిరి ఉదయ్, ఆరెపల్లి మానస్‌కుమార్, బండారి సదానందం ఆరెపల్లి మనోజ్ పాల్గొన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, నాయకులు మేడవేణి శ్రీనివాస్, ఆకుల రాజయ్య, రాగుట మల్లేష్, వడ్కాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ ఆల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో మేడే వేడుకలు నిర్వహించారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్ స్కూటర్ స్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించారు.

జూలపల్లి: మండలకేంద్రంతో పాటు పెద్దాపూర్ ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

గోదావరిఖని: కమాన్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, మండల కన్వీనర్ కృష్ణకుమారి, డి జయసుధ, ఎం కృష్ణవేణి, శారద, అంజలి, రాధా, కుమారి, సరోజన, మనీ, రాజకుమారి పాల్గొన్నారు.

కోల్‌సిటీ: ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏ గేట్ ముందు అధ్యక్షులు అంబటి నరేష్ అరుణ పతాకాన్ని ఎగురేశారు. కార్యక్రమంలో అఫ్జల్, రత్నంశ్రీను, మేకల శ్రీను, నయీం బాబా, రాంకీగౌడ్, పొన్నం సురేష్ పాల్గొన్నారు.

ఓరుగంటి కృష్ణకు శ్రమశక్తి అవార్డు



శ్రమశక్తి అవార్డును అందజేస్తున్న సీం రేవంత్‌రెడ్డి

గోదావరిఖని: మేడే దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందజేసే శ్రమశక్తి అవార్డును రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సింగరేణి ఉద్యోగి ఓరుగంటి కృష్ణకు గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు. జీడీకే ఓసీపీ-5లో కృష్ణ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, కనీస వేతన బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్ పాల్గొన్నారు.



ఎలిగేడులో..



పెద్దపల్లిలో సీపీఐ నాయకులు..



మహిళా కార్మికులకు చీరలు అందజేస్తున్న అంబటి సంతోష్

సాగు ప్రణాళిక ఖరారు

(5వ పేజీ తరువాయి)

రకం విత్తనాలను అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆదిరెడ్డి తెలిపారు. ఈ విత్తనాన్ని 2016లో భారత పప్పు దినుసుల పరిశోధన సంస్థ- కాన్పూర్ విడుదల చేసిందన్నారు. దీని పంట కాలం 65 నుంచి 70 రోజులని, ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఈ రకం విత్తనం వేసవి కాలంలో వేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. పెద్దపల్లి డీసీఎంఎస్‌లో 12 క్వింటాళ్లు, సుల్తానాబాద్ సింగిల్‌విండోలో ఐదు క్వింటాళ్లు, ఏఆర్‌ఎస్‌కే రామగిరిలో మూడు క్వింటాళ్లు, ఏఆర్‌ఎస్‌కే అడవి సోమన్‌పల్లిలో ఆరు క్వింటాళ్లు, కాల్వశ్రీరాంపూర్ సింగిల్ విండోలో రెండు క్వింటాళ్లు, నంది మేడారం సింగిల్ విండోలో రెండు క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎకరానికి ఎనిమిది కిలోల విత్తనాలు అవసరముంటాయని, కిలో విత్తనం ధర 148 రూపాయలు, నాలుగు కిలోల విత్తనాల సంచి 592 రూపాయలకు విక్రయించనున్నారని తెలిపారు. అవసరమున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మథర్ థెరిస్సాలో నైపుణ్యంపై అవగాహన

పెద్దపల్లి రూరల్ , మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మథర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టాస్క్ ఆధ్వర్యలో విద్యార్థులకు ఇంటర్వ్యూ, స్కిల్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచలో ఇంటర్వ్యూ , స్కిల్స్ ఉద్యోగ సాధనలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు తమ నైపుణ్యం పెంపొందించేందుకు గాను ఇటువంటి ప్రోగ్రాంలు నిర్వహించి అధిక సంఖ్యలో ఉద్యోగ నియమకాల్లో ముందున్నామన్నారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై కార్మికులకు అవగాహన ఉండాలి

జ్యోతినగర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు తమకున్న హక్కులు, అమలౌతున్న చట్టాలపై అవగాహన ఉండాలని ఎన్టీపీసీ విజిలెన్స్ విభాగం ఏజీఎం సుధాకర్ భోగరాజు అన్నారు. కార్మిక హక్కుల దినోత్సవం సందర్భంగా గురువారం విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈడీసీ మిలీనియం హాలులో కార్మికులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు రక్షణ కవచంగా చట్టాలునానయని, వాటి గురించి కార్మికులు అవగాన కలిగి ఉడాలన్నారు. ఈ సందర్భంగా అధికారి దీపక్ కుమార్ పాఠక్ కార్మికులకు ఉన్న లేబర్ లాస్, సౌకర్యాలు, హక్కులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కనీస వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సురెన్స్(ఈఎస్ఐ), మెటర్నిటీ బెనిఫిట్లు, సమాన వేతనం, గ్రీవియెన్స్ తదితర అంశాలపై పాఠక్ కార్మికులకు అ వగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు వినయ్ జోస్, కె.లింగయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్, ఆదేశ్‌కుమార్ పాండే, అబిషేక్ కుమార్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

అంధకారంలో ‘ఖని’ ఆసుపత్రి రహదారి

పదిహేను రోజులుగా వెలగని వీధి దీపాలు



వీధిదీపాలు వెలగకపోవడంతో చీకటిమయంగా మారిన రహదారి

కళ్యాణ్‌నగర్, మే 1(ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో రద్దీగా ఉండే గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రహదారిపై 15రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ ఆఫీస్ పక్కన ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు, సబ్ స్టేషన్ నుంచి ఆసుపత్రి వరకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో అనారోగ్య సమస్యతో వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో కొంత మంది మద్యం సేవిస్తుండడం రోగులను ఇబ్బందులకు గురి చేస్తుంది. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

వైభవంగా బీరప్ప ఉత్సవాలు

గోదావరిఖని మే 1 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో గొల్ల, కుర్మ, యాదవ సంఘాల ఆరాధ్యదైవమైన బీరప్ప ఉత్సవాలు తొమ్మిది రోజులగా కొనసాగుతున్నాయి. గురువారం ఎట్టిముల్లల కార్యక్రమంతో ముగిశాయి. డోలువాయిద్యాల నడుమ బీరప్ప ఉత్సవాలను పూజారులు కన్నుల పండగగా నిర్వహించారు. అనంతరం గురువారం రాత్రి ఆలయం వద్ద ఒగ్గుకళాకారులు నిర్వహించిన బీరప్ప ఒగ్గుకథను వీక్షించేందుకు భారీ సంఖ్యలో గ్రామస్థులు తరలివచ్చారు.

ఈదురు గాలులతో దెబ్బతిన్న ఇళ్లు, విద్యుత్ స్తంభాలు

మంథనిరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బలంగా వీచిన ఈదురు గాలులతో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 27 విద్యుత్‌స్తంభాలు కింద పడిపోయాయి. మండలంలోని ఖానాపూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో పలు ఇళ్లు దెబ్బతినగా పలు గ్రామాల్లో షెడ్లపై ఉన్న రేకులు గాలికి కొట్టుకుపోయాయి. కొన్ని గ్రామాల్లో వరి పంట నెలకొరగగా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొట్టుకుపోయింది. వర్షం కురియడంతో రైతులు రాత్రి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారానికి పుట్టపాక, ఎక్లాస్‌పూర్, గోపాల్‌పూర్, సూరయ్యపల్లి, బోయినిపేట, మంథని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోగా చెట్లు విరిగి పడటంతో విద్యుత్ వైర్లు తెగిపోడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురయ్యారు.

కులగణనతో దేశంలో సామాజిక ఐక్యత

పెద్దపల్లిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కుల గణనతో దేశంలో సామాజిక ఐక్యత వస్తుందని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటే కుల గణనను చేయడానికి కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, గురువారం బీజేపీ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో పెద్దపల్లి జెండా చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణనను చేపట్టాలని మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ ప్రభుత్వం జరిపే జన, కులగణనతో దేశం పటిష్ఠంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర్‌రావు, పోల్సాని సంపత్ రావు, మేకల శ్రీనివాస్, కావేటి రాజగోపాల్, ఈర్ల శంకర్, వొల్లే తిరుపతి, రాజాం మహంతకృష్ణ, పూరేళ్ల రాజేశం, ఎర్రోళ్ల శ్రీకాంత్,బొడ్డుపల్లి కుమార్,జాపతి శ్రీనివాస్,గాదాసి సతీష్,ఉమేష్,వేణు,బొడ్డుపల్లి సంపత్, పడాల శ్రీనివాస్, బొడ్డుపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

● **సామాజిక సమానత్వం సాధించడానికే...**

గోదావరిఖని: దేశంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని నరేంద్ర మోదీ సర్కారు నిర్ణయించిందని, ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు బీజేపీ ఎస్‌సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ సర్కార్ కులగణన నిర్వహించడం సామాజిక సమానత్వం లక్ష్యానికి దోహదం చేస్తుందని, అందరికీ న్యాయం చేయడం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల చరిత్ర, సామాజిక గణనపై కేవలం రాజకీయ ప్రయోజనాల కోసంగానే మిగిలిపోయాయన్నారు. మోదీ సర్కార్ కులగణనను పారదర్శకంగా, సరైన పద్ధతిలో నిర్వహించడానికి సంకల్పబద్ధంగా ఉందన్నారు. కులగణన నిర్ణయం దేశ వ్యాప్తంగా ప్రతి వర్గానికి పునరుద్ధరణ చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ధర్మారం, మే 1 (ఆంధ్రజ్యోతి) ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ధర్మారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఆవుల రమ్య అనే విద్యార్థిని 559 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఎం లక్ష్మీహర్షిత 523 మార్కులు, ఇ అభినయశ్రీ 516, ఎ రాజశ్రీ 501 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఎల్ మాలతీలత అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, అంజయ్య, రాజునాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ‘వాణి’ విద్యార్థులు

రామగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని సెంటినరీకాలనీకి చెందిన వాణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి సత్తాచాటారు. పదో తరగతిలో ఒర్రె సాహితి 584 మార్కులు సాధించింది. చిప్ప సాత్విక్ 581, మాన్విత 578, మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన 61 మందిలో 47 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రినిటి కళాశాలల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ దాసరి మమతప్రశాంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ బుద్దుల తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

కోల్‌సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కందుల సతీష్ విద్యార్థులకు సూచించారు. గురువారం 14వ డివిజన్ చైతన్యపురి కాలనీ, లక్ష్మీపురం యూపీఎస్ స్కూల్ ఆవరణలో చేపట్టిన వేసవి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభిం చారు. అనంతరం క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు శ్రీలత, పుష్పలత, హెచ్‌ఎం పద్మావతి, కుమార్, రజిత, శంకర్, మహ్మద్ గౌస్, సంతోష్, సంపత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మంథని, మే 1 (ఆంధ్రజ్యోతి): మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిక పంపిణీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చల్లా పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

గనులపై ఘనంగా మేడే సంబరాలు

గోదావరిఖని, మే 1 (ఆంధ్రజ్యోతి): గనులపై మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాసున్నాయని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. మేడే సందర్భంగా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే2 ఇంక్లైన్‌పై మేడే జెండాను ఆవిష్కరించారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆర్‌జీ-1 ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి యూనియన్ నాయకుడు నూనె కొమురయ్య హాజరై జెండావిష్కరించారు. టీఎన్‌ఎస్‌టీయూసీ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ జీఎం కాలనీ, జీడీకే 1ఇంక్లైన్, జీడీకే ఓసీపీ-5లో జెండావిష్కరణ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్‌జీ1లోని అన్నీ బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్లపై రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, నాయకులు జెండావిష్కరణ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా పలు బొగ్గు గనులతో పాటు కాలనీల్లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, రామకృష్ణ, రాజేశం, మొగిలి, దుర్గయ్య, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.





కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు, కార్మికులు, జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: ఆర్జీ-2 పరిధిలోని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై అరుణ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, నాయకులు ఎల్ ప్రకాష్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, బుర్ర తిరుపతి, రవికుమార్, మహేందర్ పాల్గొన్నారు. సీఐటీయూ ఆఫీస్ ఆవరణలో మేడేను పురస్కరించుకుని నాయకులు ఎర్ర జండా ఎగురవేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ ఆఫీస్‌లో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో యూనియన్ ఆఫీస్‌లో ఎర్రజండా ఆవిష్కరించిన అనంతరం షాపింగ్ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఓసీపీ-1 ప్రాజెక్టులో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, హెచ్‌ఎంఎస్, సీఐటీయూల ఆధ్వర్యంలో సంయుక్తంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.

రామగిరి: ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లో జరిగిన వేడుకల్లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఆర్జీ-2లో వేసవి క్రీడాశిబిరం ప్రారంభం

గోదావరిఖని, మే 1(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పీపుల్స్ స్పోర్ట్స్ అంగ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడాశిబిరాన్ని గురువారం జీఎం బండి వెంకటయ్య ప్రారంభించారు. అబ్దుల్‌కలాం స్టేడియంలో చిన్నారులకు పరిచయం చేసుకుని శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. వేసవిలో విద్యార్థులకు ఉపయోగపడేలా వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఏదైనా ఒక క్రీడలో నైపుణ్యం సాధించేలా ఈశిబిరంలో శిక్షణ పొందాలని జీఎం సూచించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈ)మురళీకృష్ణ, ఎస్ఎస్‌ఓ షరీఫ్ మహమ్మద్, హానరబుల్ స్పోర్ట్స్ సెక్రెటరీ వేణుగోపాల్, సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ పోశం పాల్గొన్నారు.

ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లో ఉత్పత్తి వివరాలు

రామగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్‌లలో ఏప్రిల్ నెలలో చేసిన ఉత్పత్తి వివరాలను ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో వెల్లడించారు. ఏప్రిల్ నెలలో ఆర్జీ-3 డివిజన్‌కు నిర్దేశించిన 5.75 లక్షల టన్నులకు 5.09 లక్షల టన్నులు సాధించి 89 శాతం నిలిచినట్లు పేర్కొన్నారు. ఏపీఏ డివిజన్‌కు నిర్దేశించిన0.16 లక్షల టన్నుల లక్ష్యానికి 0.13 లక్షల టన్నులు సాధించి 84 శాతంలో నిలిచినట్లు వారు పేర్కొన్నారు.